# కామారెడ్డిని అభివృద్ధి చేయడమే కేసీఆర్ లక్ష్యం


శాబ్దిపూర్‌లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తిలకం దిద్దుతున్న మహిళలు


ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు స్వాగతం పలుకుతున్న గర్గుల్ గ్రామస్తులు

- మూడు గంటల కాంగ్రెస్ కావాలా? మూడు పంటల కేసీఆర్ కావాలా? ప్రజలు ఆలోచన చేయాలి
- మహిళలకు బీడీ పింఛన్ ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆరే..
- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

కామారెడ్డి రూరల్, నవంబర్ 20 : కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని.. అందుకే ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి మండలంలోని గర్గుల్, ఇస్రోజివాడి, తిమ్మక్కపల్లి(ఎం), గూడెం, శాబ్ది పూర్, శాబ్దిపూర్ లెఫ్ట్ తండా గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ విప్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం రాకముందు 10 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటు రాష్ట్రంలో అటు దేశంలో భర్తలు చనిపోయిన అక్కాచెల్లెళ్లకు రూ.200, దివ్యాంగులకు రూ.500 పింఛన్ మాత్రమే ఇచ్చిందని అన్నారు. ప్రస్తుతం వితంతువులకు రూ.2016, దివ్యాంగులకు రూ.4 వేలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. మూడోసారి మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, 3వ తేదీ తర్వాత వితంతువులకు రూ.ఐదు వేలు, దివ్యాంగులకు రూ.ఆరు వేలు పింఛన్ ఇవ్వనుందని అన్నారు. 3వ తేదీ తర్వాత దరఖాస్తు చేసుకున్న మహిళలకు బీడీ పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఏ ఇంట్లో అయితే పింఛన్ రావడం లేదో అలాంటి ఆడబిడ్డలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద రూ.3 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రూ.ఐదు లక్షలు ఉన్న కేసీఆర్ ఆరోగ్యశ్రీని రూ.15 లక్షలకు పెంచనున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి అన్నట్లు మూడు గంటల కాంగ్రెస్ కావాలా? మూడు పంటల కేసీఆర్ కావాలా? ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు. అసైన్డ్ భూములు ఉన్న అన్ని కులాల వారికి మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి పేర్లపై రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు చెప్పారు. కామారెడ్డి జిల్లా అభివృద్ధి కోసమే కేసీఆర్‌ను ఇక్కడి నుంచి పోటీ చేయాలని కోరినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ నరేశ్, జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపీగౌడ్, నిమ్మ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిండ్ల అంజయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జోరుగా కొనసాగుతున్న ప్రచారం**

దోమకొండ/రాజంపేట్/బీబీపేట్/భిక్కనూరు, నవంబర్ 20 : కేసీఆర్‌కు మద్దతుగా మండలాలు, గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని, బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. దోమకొండ, రాజంపేట్, బీబీపేట్, భిక్కనూరు మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేసి సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ రవీందర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

**కేసీఆర్‌కు ఆంధ్ర మేస్త్రీల మద్దతు**

కామారెడ్డి, నవంబర్ 20 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి ఆంధ్ర మేస్త్రీ యూనియన్ నాయకులతో సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆంధ్ర మేస్త్రీల మద్దతు ఉంటుందని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, బీఆర్ఎస్ నాయకులు శివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, ఆంధ్ర మేస్త్రీలు చిన్న శివారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


మేస్త్రీలతో మాట్లాడుతున్న నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్

## బీఆర్ఎస్‌లో చేరిక



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ నాయకుడు తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ప్రముఖ విద్యా సంస్థల చైర్మన్ గురువేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

– కామారెడ్డి, నవంబర్ 20

## ర్యాండమైజేషన్ ద్వారా ఓటింగ్ బృందాల కేటాయింపు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, నవంబర్ 20 : ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు హోమ్ ఓటింగ్ బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు.సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఛిఫంగ్ అర్డుర్ వర్చ్యాయో, జగదీశ్ సమక్షంలో ర్యాండమైజేషన్ పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 533 మంది 80 సంవత్సరాలు పైబడ్డ వృద్ధులు, దివ్యాంగులు ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా జుక్కల్‌కు 5, ఎల్లారెడ్డికి 4, కామారెడ్డి నియోజకవర్గానికి 3 బృందాల చొప్పున 12 బృందాలను కేటాయించామని కలెక్టర్ తెలిపారు. ఒక్కో బృందంలో ఒక సూక్ష్మ పరిశీలకుడు, ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ సిబ్బంది, ఇద్దరు పోలీసులతో పాటు ఒక వీడియోగ్రాఫర్ ఓటింగ్ ప్రక్రియను చిత్రీకరిస్తారని అన్నారు. ఈ బృందాలు మంగళ, బుధవారాల్లో తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియపూర్తి చేస్తారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారులు రాజారామ్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.లక్షా 81 వేలు స్వాధీనం

భిక్కనూరు, నవంబర్ 19 : భిక్కనూరు టోల్ గేట్ వద్ద ఎస్సై సాయికుమార్ సిబ్బందితో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. నిర్మల్‌కు చెందిన చిక్కేసి రంజిత, తన వాహనంలో లక్షా వేయి రూపాయలను ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. సోమవారం నిర్మల్ జిల్లా ముధోల్‌కు చెందిన ఎర్రం మహేశ్ తన కారులో రూ.80 వేల నగదును ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎన్నికల ఖర్చుపై అకౌంటింగ్ పక్కాగా నిర్వహించాలి

### ఎన్నికల వ్యవ పరిశీలకుడు పర శివమూర్తి

కామారెడ్డి, నవంబర్ 20 : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులపై మరింత నిశితంగా పరిశీలిస్తూ అకౌంటింగ్ పక్కాగా నిర్వహించాలని ఎన్నికల వ్యవ పరిశీలకుడు పర శివమూర్తి జిల్లా యంత్రాంగానికి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశమందిరంలో జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వీ పాటిల్‌తో కలిసి ఎంసీఎంసీ సోషల్ మీడియా, వ్యయ నోడల్ అధికారులతో మాట్లాడారు. అభ్యర్థులు ప్రచారాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ప్రతి ఖర్చును లెక్కించాలని చెప్పారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందారా లేదా పరిశీలించాలని అన్నారు. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను 24 గంటలు నిశితంగా పరిశీలిస్తూ అనుమతులు లేనట్లయితే నోటీసులు ఇచ్చి ఖర్చు బుక్ చేయాలన్నారు. వ్యయ నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ పక్కాగా సాక్ష్యాధారాలతో ఖర్చును షాడో రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆ వివరాలు అభ్యర్థి ఖర్చు రిజిస్టర్‌తో రీ–క్యాన్సిల్ చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంసీఎంసీ కమిటీ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, సతీశ్‌యాదవ్, శాంతి కుమార్, ప్రవీణ్, నోడల్ అధికారి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అత్యధిక పింఛన్ ఇచ్చేది కేసీఆరే..

### రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వాసుదేవారెడ్డి

కామారెడ్డి, నవంబర్ 20 : దేశంలో దివ్యాంగులకు అత్యధిక పింఛన్ ఇచ్చిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వాసుదేవారెడ్డి అన్నారు. కామారెడ్డిలోని శుభం ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గంలోని దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలు దివ్యాంగులకు ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్ ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా రూ.4016 పింఛన్‌ను మన రాష్ట్రంలో అందజేస్తున్నారని అన్నారు. తొమ్మిది ఏండ్లుగా కేవలం దివ్యాంగులకు రూ.10,300 కోట్లు ఖర్చు పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేది కేవలం కేసీఆర్ మాత్రమే అని అన్నారు. కామారెడ్డి లాంటి ఉద్యమ గడ్డపై కేసీఆర్‌లాంటి వ్యక్తి పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. అలాంటి వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపిస్తే గజ్వేల్ ఎలా అభివృద్ధి చెందిందో కామారెడ్డి కూడా అంతకన్నా ఎక్కువ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే దివ్యాంగులకు అన్ని సంక్షేమ పథకాలు అందాయన్నారు. దివ్యాంగులు బీఆర్ఎస్ వైపు నిలబడి కేసీఆర్ గెలుపులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఫుడ్ కమిషన్ మాజీ చైర్మెన్ తిర్మల్ రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర సంవత్సరాల్లో రాష్ట్రం ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసని అన్నారు. కేసీఆర్ లాంటి గొప్ప వ్యక్తి కామారెడ్డిలో పోటీ చేస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఏకమై కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, చిప్ప దుర్గా ప్రసాద్, దివ్యాంగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వాసుదేవారెడ్డి


పాల్గొన్న దివ్యాంగులు